

సాక్షి
గుంటూరు
ఆదివారం । 19 । అక్టోబర్ । 2025



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 588.70 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి 53,685 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.



పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 29,820 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి దిగువకు 37,773 క్యూసెక్కులు వదులుతున్నారు.



భక్తి సంగీత విభావరి

నగరంపాలెం(గుంటూరు) : బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వర్వసామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శనివారం భక్తి సంగీత విభావరి నిర్వహించారు.

న్యూస్‌రీల్

పులిచింతల ప్రాజెక్ట్ ప్రత్యేక కలెక్టర్‌గా సూరజ్ గనోరే

జేసీకి అదనపు బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం

నరసరావుపేట: జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరేకు కేఎల్ రావుసాగర్ (పులిచింతల ప్రాజెక్ట్) ప్రత్యేక కలెక్టర్‌గా పూర్తి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం జీఓ జారీ చేసింది.

శివాలయంలో కార్తికమాస ఏర్పాట్లపై సమీక్ష



పెదకాకాని: కార్తిక మాసం సందర్భంగా పెదకాకాని శ్రీమల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. పెదకాకాని శ్రీమల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో కార్తికమాస ఏర్పాట్లపై అర్చక స్వాములు, సిబ్బందితో శనివారం సమీక్ష నిర్వహించారు. భక్తుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలన్నారు.

క్రీస్తు జయంతి జూబ్లీ వేడుకలకు సర్వం సిద్ధం



రెంటచింతల: క్రీస్తు జయంతి జూబ్లీ వేడుకలకు సర్వం సిద్ధం చేసినట్లు స్థానిక కానుకమాత చర్చి విచారణ గురువులు రెవ. ఫాదర్ వైఎల్ మర్రెడ్డి అన్నారు. శనివారం చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కానుకమాత కళావేదిక వద్ద క్రీస్తు జయంతి జూబ్లీ వేడుకల సందర్భంగా సమిష్టి పవిత్ర పూజాబలికి ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. గుంటూరు మేత్రాసన పీఠాధిపతులు మహాఘన డా.చిన్నాబత్తిని భాగ్యయ్య నేతృత్వంలో సమిష్టి పవిత్ర పూజాబలి సమర్పించడం జరుగుతుందన్నారు. పల్నాడు డీనరి పరిధిలో ఉన్న 14 విచారణలకు సంబంధించిన ఫాదర్లు, కన్య స్త్రీలు, భక్తులు పాల్గొంటారన్నారు.

మెడికల్ కాలేజీకి 420 హిస్టాలజీ స్లైడ్లు అందజేత



గుంటూరుమెడికల్: గుంటూరు మెడికల్ కాలేజీ అనాటమీ విభాగానికి 420 హిస్టాలజీ స్లైడ్లు అందజేశారు. కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకట సుందరాచారి స్లైడ్లను మణిపాల్ వైద్య విశ్వవిద్యాలయం నుంచి తెప్పించి, అనాటమీ విభాగానికి అందజేశారు. అనాటమీ విభాగాధిపతి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మాధవి మాట్లాడుతూ ఈ హిస్టాలజీ స్లైడ్లు ప్రథమ సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థులు, అనాటమీ పీజీ వైద్య విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ సుందరాచారి మాట్లాడుతూ విద్యార్థులు ప్రాక్టికల్ స్థాయిలో శరీర నిర్మాణాన్ని అర్థం చేసుకునేలా సదుపాయాలు మెరుగుపరచడం మా లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పీజీ వైద్య విద్యార్థులు డాక్టర్ సుందరాచారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. వైస్ ప్రిన్సిపల్ (అడ్మిన్) డాక్టర్ శ్రీధర్, అనాటమీ విభాగం సహా ఆచార్యులు, సహాయక ఆచార్యులు, పీజీ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

నందీశ్వరునికి అభిషేకం



తెనాలి: చినరావూరులోని శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత శ్రీసోమేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం నందీశ్వరునికి అభిషేకం చేశారు. ముందుగా అఖండ దీపారాధన, విఘ్నేశ్వర పూజ తదుపరి సోమేశ్వరునికి అభిషేకం, బాలాత్రిపురసుందరి దేవికి కుంకుమ అర్చన చేశారు. అనంతరం నందీశ్వరునికి అభిషేకం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



'సాక్షి' మీడియాపై కూటమి ప్రభుత్వ అక్రమ కేసులు, వేధింపులను నిరసిస్తూ తెనాలి తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు



మంగళగిరిలో డిప్యూటీ తహసీల్దార్ అంకారావుకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు



ప్రత్తిపాడులో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నియోజకవర్గ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు



రాష్ట్రంలో పత్రిక స్వేచ్ఛను హరించేలా కొనసాగుతున్న నిరంకుశ పాలనపై జర్నలిస్టులు శనివారం నిరసన గళం వినిపించారు. 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, పాత్రికేయులపై అక్రమ కేసులు పెట్టిన పాలకుల తీరును ఖండించారు. పలు ప్రజాసంఘాల నేతలు వారికి మద్దతు తెలిపారు. ప్రజాగొంతుకై నిలిచిన కారణానికి వేధింపులు తగవని హితవు పలికారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేలా సాక్షి పత్రికపై, పాత్రికేయులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని హితవు పలికారు. ఇకనైనా ప్రజల కష్టాలు తీర్చే మార్గాలు ఆలోచించాలని పాలకులకు సూచించారు. - తెనాలి/మంగళగిరి/ ప్రత్తిపాడు

రూ. పది లక్షలిస్తే దుకాణం పదిలం!

- నగర పాలక సంస్థ అధికారుల బరితెగింపు
- కొల్లి శారద మార్కెట్ దుకాణాల కోసం వసూళ్లకు తెరలేసిన యంత్రాంగం
- న్యాయం చేయాలని వ్యాపారుల ఆందోళన



బుడంపాడు బైపాస్ వద్ద నిర్మించిన అన్నపూర్ణ కాంప్లెక్స్

సాక్షి ప్రతినిధి, గుంటూరు, నెహ్రూనగర్: కొల్లి శారద మార్కెట్ పాత లీజుదారుల పరిస్థితి దారుణంగా తయారైంది. మార్కెట్‌లో 25 సంవత్సరాలుగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా వ్యాపారం చేసుకుంటున్న తమను లీజు గడువు పూర్తయిందంటూ హడావుడి చేసి బయటకు పంపారని కొల్లి శారద హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముడుపులు ఇస్తే రెన్యూవల్?

ఈ మార్కెట్‌లో 81 షాపులు ఉన్నాయి. ఒక్కోదానికి రూ.10 లక్షల చొప్పున రూ.8.10 కోట్లు ఇస్తే రెన్యూవల్ చేస్తామని నగరపాలక సంస్థ అధికారులు మధ్యవర్తుల ద్వారా చెప్పారని వ్యాపారస్తులు ఆరోపిస్తున్నారు. అంత స్థోమత లేక అన్నపూర్ణ కాంప్లెక్స్‌లో వ్యాపారం చేసుకుంటున్నామని పేర్కొన్నారు. ఇక్కడికి కూడా వచ్చి ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో పక్క తాము రైతులను కొల్లి శారద మార్కెట్‌కు వెళ్లనివ్వడం లేదనడం సమంజసం కాదని వ్యాపారస్తులు వాపోతున్నారు. వద్దని తాము ఆపితే వారు ఎలా ఆగుతారని.. ఇష్టపూర్వకంగా వస్తున్నారని వ్యాపారులు చెబుతున్నారు.

లీజుకు ముందు చెప్పలేదు..

నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా ఉన్న పీవీకే నాయుడు మార్కెట్‌లో వ్యాపారం చేసుకుంటున్న వారిని నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా 1999లో అప్పటి నగర కమిషనర్ కృష్ణబాబు అక్కడి నుంచి పంపించేశారు. వారిని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న డాక్టర్ కొల్లి శారద మార్కెట్‌కు తరలించారు. మార్కెట్‌కు వెళ్లే ముందు లీజు గడువు విషయం తమకు చెప్పకపోవడంతో 25 సంవత్సరాలుగా కార్పొరేషన్‌కు అద్దెలు చెల్లిస్తూ వ్యాపారాలు చేసుకుంటున్నామని వ్యాపారులు తెలిపారు. ఈ క్రమంలో 2013లో జీఓ వచ్చిందని నగరపాలక సంస్థ అధికారులు హడావుడిగా వచ్చి షాపులను ఖాళీ చేయాలని, బహిరంగ వేలం పెట్టాలని చెప్పారు. మరో పక్క ప్రస్తుతం ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉండటంతో పోలీసులు ఇబ్బందులను తట్టుకోలేక బుడంపాడు బైపాస్ వద్ద 4 ఎకరాల స్థలం కొనుగోలు చేశామన్నారు. అనుమతులు ఇవ్వాలని నగరపాలక సంస్థ అధికారులను కోరినా కుదరదన్నారని చెప్పారు. కనీస వసతులు కూడా కల్పించలేమని తెలిపినట్లు పేర్కొన్నారు. లీజు గడువు పూర్తయిందని కొల్లి శారద మార్కెట్ షాపులకు వేలం పాట పెట్టేశారన్నారు. ఒక్కో షాపు రూ.లక్ష నుంచి రూ.6.50 లక్షల వరకు పలికిందని చెప్పారు. అంత పెట్టి వ్యాపారం చేయలేమని బుడంపాడు బైపాస్ వద్ద ఉన్న అన్నపూర్ణ కాంప్లెక్స్‌లోకి వెళ్లామన్నారు. వ్యాపారం చేయడానికి వీల్లేదని అధికారులు ఇబ్బంది పెడుతున్నట్లు వాపోయారు.



బైపాస్‌పైనే ఆగిన కూరగాయల లోడు లారీ

ప్రత్యామ్నాయం చూపాలి

రూ.లక్షలు కట్టి తాము కొల్లి శారద మార్కెట్‌లో వ్యాపారం చేసుకునే పరిస్థితులు లేవని వ్యాపారులు తెలిపారు. తాము ప్రైవేట్ స్థలంలో వ్యాపారం చేసుకునేందుకు అవకాశం కల్పిస్తామని అధికారులు చెప్పడంతో మార్కెట్ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. కానీ ఇంత వరకు స్పందన లేదని చెప్పారు. అన్నపూర్ణ కాంప్లెక్స్‌లో తమను వ్యాపారం చేసుకోనివ్వడం లేదని వాపోయారు.

విద్యుత్ సేవల్లో నాణ్యత ముఖ్యం

జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా

గుంటూరు వెస్ట్: జిల్లాలో ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ యూనిట్లు ఏర్పాటు వేగవంతం చేయాలన్నారు, ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా యూనిట్లు ఏర్పాటు చేయాలన్నారు.

- సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం (పీజీఆర్ఎస్)కు విరామం ప్రకటించినట్లు కలెక్టర్ కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. సోమవారం దీపావళి కారణంగా రద్దు చేస్తున్నామని పేర్కొన్నారు.
- జిల్లాలో వైద్య సేవలు పేదలకు అందేలా మరింత విస్తృతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. శనివారం సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్య శాఖ సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఔట్ పేషెంట్ సేవలు మెరుగు పరచాలన్నారు.
- కాలుష్యం లేని దీపావళిని ఆనందంగా అందరూ జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ అన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో దీపావళిపై రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్, అధికారులు శనివారం సమావేశ మందిరంలో సంయుక్తంగా ఆవిష్కరించారు.



దీపావళిపై అవగాహన పోస్టర్ ఆవిష్కరణ

ప్రజల భాగస్వామ్యం కీలకం

గుంటూరు జిల్లాను క్లీన్, గ్రీన్‌గా మార్చడానికి ప్రజల భాగస్వామ్యం కీలకం అని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక జిల్లా కోర్టు కాంపౌండ్ వద్ద జీఎంసీ ఆధ్వర్యంలో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో క్లీన్ ఎయిర్ అంశంపై నిర్వహించిన ర్యాలీని కలెక్టర్‌తోపాటు జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యే గళ్లా మాధవి, నగర మేయర్ కొవెలమూడి రవీంద్ర బాబులు ప్రారంభించారు. నగరంలో వాయు కాలుష్యం తగ్గించేలా ఈ సీజన్‌లో 5 లక్షల మొక్కలు నాటడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో హజ్ కమిటీ చైర్మన్ హసన్ బాషా, డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ఎస్‌కే ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ చక్రవర్తి, డీటీసీ సీతారామిరెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సువర్ణబాబు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

పేదల ప్రాణాలతో కూటమి చెలగాటం

- 45 మంది చనిపోతే స్పందన ఉండదా?
- మరణాలకు కారణాలు ఏంటో ఇప్పటికీ తెలియదట
- బాధిత కుటుంబానికి రూ. 5 లక్షలిచ్చి చేతులు దులుపుకొంటే చాలా?
- అడిగేవారు లేరని పేదల ప్రాణాలతో ఆటలాడొద్దు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు
- తురకపాలెం మరణాలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతి పత్రం అందజేస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, మాజీ మంత్రి అంబటి రాంబాబు, పార్టీ నేతలు

గుంటూరు వెస్ట్ : గుంటూరు శివారు ప్రాంతం తురకపాలెం గ్రామంలో 45 మంది చనిపోతే ఇప్పటికీ సరైన కారణాలు కనుక్కోకపోవడం కూటమి ప్రభుత్వం చేతగానితనానికి నిదర్శనమని మాజీ మంత్రి, గుంటూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అంబటి రాంబాబు దుయ్యబట్టారు. శనివారం జిల్లా పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియాను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం అంబటి విలేకరులతో మాట్లాడుతూ పేదల మరణాలంటే ఈ ప్రభుత్వానికి లెక్కలేదన్నారు. ఆ మరణాలకు కారణాలు తెలుసుకోలేదని నిలదీశారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా జరిగిన సంఘటన గనుక దాటవేసే ధోరణని అవలంబిస్తున్నారని తెలిపారు. తక్షణమే నిజనిర్ధారణ కమిటీ వేసి అసలు కారణాలకు బయట పెట్టాలని డిమాండ్ చేశారు.

కల్తీ మద్యమే మరణాలకు కారణం

ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కల్తీ మద్యాన్ని సరఫరా చేస్తోందన్నారు. దాని కారణంగానే 45 మంది మరణించారన్నారు. కంటితుడుపు చర్యగా రూ.5 లక్షలు కొందరి కుటుంబాలకే ఇచ్చారని గుర్తుచేశారు.



మాట్లాడుతున్న ఆళ్ల అయోధ్యరామిరెడ్డి

బాధిత కుటుంబాలను రూ.25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పరిష్కారం గురించి ఆలోచించాలి

రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సమస్యను దాటవేసే ధోరణితో కాకుండా పరిష్కారం చూపేలా వ్యవహరించాలన్నారు. తురకపాలెంలో కలుషిత నీటి సమస్య గత 5 నెలలుగా ఉందన్నారు. తాగునీటిలో హాని చేసే బ్యాక్టీరియా ఉందని తక్షణమే ప్లాంట్‌ను పరిశుభ్రం చేయాలని తెలిపారు. నగర పాలక సంస్థ నుంచి ప్రత్యేక నిధులు కేటాయించి తాగునీటిని సరఫరా చేయాలన్నారు.

- మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గుంటూరులోనే ఒక ల్యాబ్ ఏర్పాటు చేసి, పరికరాలు, స్టాఫ్‌ను సమకూర్చాలన్నారు.
- నందిగామ మాజీ శాసన సభ్యులు మొండితోక జగన్ మోహన్ రావు మాట్లాడుతూ తురకపాలెం మరణాలకు మెలోడియోసిస్ బ్యాక్టీరియా కారణమని కూటమి నేతలు అంటున్నారన్నారు. ఇటీవల జీజీహెచ్‌లో ఇదే బ్యాక్టీరియాతో ఇబ్బంది పడుతున్న ఇద్దరికి వైద్యం చేసి సురక్షితంగా పంపినట్లు వైద్యులు ప్రకటించారన్నారు. తురకపాలెం బాధితులకు ఇలాంటి వైద్యం ఎందుకు చేయలేదో చెప్పాలని డిమాండ్ చేసారు.
- సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త గజ్జల సుధీర్ భార్గవరెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో మరణాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు.

కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు లేళ్ళ అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, గుంటూరు పార్లమెంట్ జిల్లా పరిశీలకులు పోతిన మహేష్, మాజీ ఎంపీ, ఎన్టీఆర్ జిల్లా పార్లమెంట్ పరిశీలకులు మోదుగుల వేణుగోపాల రెడ్డి, మాజీ మంత్రి మేకతోటి సుచరిత, పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, మంగళగిరి సమన్వయ కర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, తాడికొండ సమన్వయ కర్త వనమా బాల వజ్రబాబు, తూర్పు సమన్వయ కర్త షేక్ నూరి ఫాతిమా, నియోజకవర్గ పరిశీలకులు షేక్ గులాం రసూల్, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ సైదా, రాష్ట్ర వాలంటీర్ల విభాగం జోనల్ అధ్యక్షుడు వంగా సీతారామిరెడ్డి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మెట్టు వెంకటప్పారెడ్డి, తురకపాలెం ఎంపీపీ అంజిరెడ్డి, పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శి పిల్లి మేరీ, నాయకులు, ఎంపీపీలు, జడ్పీపిపీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నరసరావుపేటలో కాటికాపరి హత్య

నరసరావుపేట రూరల్: కాటి కాపరి హత్యకు గురైన ఘటన నరసరావుపేట శివారులోని స్వర్గపురి–2లో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు... పట్టణంలోని క్రిస్టియన్‌పాలెంకు చెందిన గాడిపర్తి ఎఫ్రాన్(31) కొంతకాలంగా స్వర్గపురి–2 శ్మశానవాటికలో కాటికాపరిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి ఎఫ్రాన్ స్వర్గపురి–2లో ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు నరికి చంపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇన్‌చార్జి డీఎస్పీ వెంకటరమణ, వన్‌టౌన్ సీఐ ఫిరోజ్‌ఖాన్, రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ కిషోర్‌లు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. పాతకక్షల నేపథ్యంలో హత్య జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు సంతానం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రామకృష్ణ తెలిపారు.



ఘటనా స్థలంలో ఎఫ్రాన్ మృతదేహం



వెలుగుల వేడుక.. బాణసంచా సిద్ధమిక..



దీపావళి వేడుకకు గుంటూరు ప్రజలు సిద్ధమవుతున్నారు. నగరంలోని చేబ్రోలు హనుమయ్య, ఎల్ఈఎం, గుంట గ్రౌండు, స్వామి థియేటర్, మైదానాలలో టపాసుల దుకాణాలు అందుబాటులో ఉన్నాయి. ప్రజల అభిరుచులకు అనుగుణంగా వెరైటీ టపాసులను విక్రయదారులు సిద్ధంగా ఉంచారు. పండుగను బాణసంచా వెలుగులలో ఆనందంగా జరుపుకొనేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. – సాక్షి, ఫోటోగ్రాఫర్, గుంటూరు



వాణిజ్యం

నిమ్మకాయల ధరలు



గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **1,600** గరిష్ఠం : రూ. **2,400**

మోడల్ ధర రూ. **2,000**

క్లుప్తంగా

రైల్వే జనరల్ టికెట్ల కొనుగోలుకూ యాప్



లక్ష్మీపురం: రైల్వే శాఖ 2018లో జనరల్ ప్రయాణికుల కోసం యూటీఎస్ యాప్ తెచ్చిందని అధికారులు తెలిపారు. డివిజన్లలో పూర్తిస్థాయిలో వినియోగించేలా ప్రయాణికులకు అవగాహన కల్పించేందుకు గుంటూరు రైల్వే డీఆర్‌ఎం సుథేష్ట సేన్ గుంటూరు పట్టాభిపురంలోని తన కార్యాలయంలో యాప్ లోగో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాప్ వినియోగం గురించి ఇప్పటికే అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇందులో సీజన్, ప్లాట్‌ఫారం, సాధారణ ప్రయాణ టికెట్లను కూడా బుక్ చేసుకోవచ్చన్నారు. సీజన్ టికెట్‌ల రెన్యూవల్ ముందుగానే చేసుకోవచ్చని సూచించారు. డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్, డీసీఎం కమలాకర్ బాబులు దీనిపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు.

చిట్టీల పేరిట మోసంపై బాధితుల ఆందోళన



లక్ష్మీపురం: చిట్టీల పేరుతో రూ.2 కోట్ల మేరకు మోసం చేసిన మహిళపై చర్యలు చేపట్టాలని బాధితులు నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో వద్ద శనివారం ఆందోళన చేపట్టారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... ఏటీఅగ్రహారం 13వ లైన్ ప్రాంతానికి చెందిన అన్నపూర్ణ అలియాస్ చిన్నారి అనే మహిళ చిట్టీలు నిర్వహించేది. మహిళలు, పురుషులతో ఆమె వద్ద చిట్టీలు కట్టారు. మొత్తం రూ.2 కోట్ల వరకు కాజేసి పరారైంది. శనివారం బాధితులు పోలీసులను ఆశ్రయించారు. తమకు న్యాయం చేయాలంటూ కోరారు.

టీడీపీ కనుసన్నల్లోనే

నకిలీ మద్యం కుంభకోణం

వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోలూరి వెంకటరెడ్డి



పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): రాష్ట్రంలో టీడీపీ నేతల కనుసన్నల్లో జరిగిన నకిలీ మద్యం కేసుకు సంబంధించి ఏడాదిన్నర కాలం పాలనలో రూ.కోట్లు దండుకున్నారని, తిరిగి వారే దొంగ.. దొంగ.. అని అరిచిన చందాన వ్యవహరిస్తున్నారని వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గుంటూరు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పోలూరి వెంకటరెడ్డి అన్నారు. గుంటూరులోని ఆయన తన కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పూర్తిస్థాయిలో టీడీపీ నేతలు, కార్యకర్తలు నకిలీ మద్యం కేసులో పట్టుబడ్డారన్నారు. దానిని వైఎస్సార్ సీపీ నేతలకు ఎలా ఆపాదిస్తారని ప్రశ్నించారు. జనార్దన్ రావును అరెస్ట్ చేసిన తరువాత ఎఫ్ఐఆర్, రిమాండ్ రిపోర్ట్‌లో ఎందుకు జోగి రమేష్ పేరు చెప్పలేదని నిలదీశారు. ఆ తరువాత వీడియో రిలీజ్ కావటంలో ఉన్న ఆంతర్యం అందరికీ తెలుసున్నారు. జనార్దన్‌రావుతో ఒక వీడియో రికార్డ్ చేయించుకుని సోషల్ మీడియా ద్వారా టీడీపీ తొత్తులుగా ఉన్న చానల్స్ గ్లోబెల్స్ ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తూ వైఎస్సార్ సీపీ నేత జోగి రమేష్‌పై అభాండాలను వేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. దీనిని న్యాయవాదులుగా ఖండిస్తున్నామన్నారు. నకిలీ మద్యం కేసు కోర్టు విచారణలో ఉండగా, టీడీపీ వ్యక్తులు ఐవీఆర్ఎస్, ఫోన్‌కాల్స్ ద్వారా వైఎస్సార్ సీపీ నకిలీ మద్యం ఏ విధంగా తయారు చేసిందో, జనార్దనరావు మాటల్లో వినమని చెప్పి, రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు ఎలా కాల్స్ వస్తాయని ప్రశ్నించారు. ఇది కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్ర కాదా అని దుయ్యబట్టారు. దీనిపై సీబీఐ ఎంక్వైరీ వేసి కోర్టు విచారణలో ఉన్న అంశంపై ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. +9179713 19649 నెంబర్ నుంచి తనకు కాల్ రావటం జరిగిందని, ఈ కాల్స్ వెనుక ఉన్న వ్యక్తులు ఎవరో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. లేని పక్షంలో న్యాయస్థానాల్లో పోరాటం చేస్తామని హెచ్చరించారు.

దేశం బలోపేతానికి ఎల్ఐసీ కీలకం

కొరిటెపాడు(గుంటూరు): ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ – మచిలీపట్నం డివిజన్ 57వ మహాసభలు శనివారం స్థానిక ఎన్‌జీఓ కళ్యాణ మండపంలో జరిగాయి. జోనల్ అధ్యక్షులు పి.సతీష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల స్వదేశీ నినాదమిచ్చిన కేంద్ర ప్రభుత్వం బీమా రంగంలో విదేశీ ఈక్విటీని వంద శాతానికి పెంచాలని నిర్ణయించడం దేశ ప్రయోజనాలకు హానికరమన్నారు. మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వ బీమా ఉద్యోగులు సంస్థలను కాపాడుకునేందుకు సమైక్య పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జోనల్ సంయుక్త కార్యదర్శి జి.తిరుపతయ్య, ఎల్ఐసీ ఆఫీసర్స్ ప్రధాన కార్యదర్శి కోటేష్ బాబు, డెవలప్మెంట్ అధికారుల కార్యదర్శి సురేష్ బాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు, మచిలీపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి జి.కిషోర్ కుమార్, మహిళా కన్వీనర్ సీహెచ్ మధుబాల తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో సతీష్, లక్ష్మణరావు, సుధాకర్ తదితరులు

నవంబరులో బాల కళాప్రభ ఉత్సవాలు

గుంటూరు ఎడ్యుకేషన్: బాలనంద కేంద్ర ఆధ్వర్యంలో బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాల స్థాయి విద్యార్థులకు రుద్ర కళాక్షేత్రం సహకారంతో 'బాల కళాప్రభ-2025 పేరుతో రాష్ట్ర స్థాయి సాంస్కృతిక ఉత్సవ, పోటీలను నవంబర్ 8, 9వ తేదీల్లో నిర్వంచనున్నారు. బాలానంద కేంద్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి, నడింపల్లి వెంకట గురుదత్‌లు ఈ మేరకు పేర్కొన్నారు. శనివారం బ్రాడీపేట రెండో లైను లోటస్ ఆద్య పాఠశాలలో కార్యక్రమాల పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా రుద్ర కళాక్షేత్రం నిర్వాహకుడు మాచిరాజు రాజేష్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లోని ఔత్సాహిక కూచిపూడి నృత్య విద్యార్థులను ప్రోత్సహించేందుకు నృత్య ప్రభ (సోలో), నృత్యమణి (గ్రూపు) పేరుతో పోటీలు నిర్వహిస్తామన్నారు. శాస్త్రీయ, జానపద నృత్యాలు, తెలుగు పద్యం, సంస్కృత శ్లోకం, తెలుగులో మాట్లాడదాం, చిత్రలేఖనం, రంగులు వేద్దాం రండి, శాస్త్రీయ గాత్ర సంగీతం, లలిత గీతాలు, వాద్య సంగీత పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆయా అంశాల్లో జూనియర్, సీనియర్ విభాగాలుగా పోటీలను నిర్వహించి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తామని వివరించారు. 91826 85890, 89199 81839, 90300 88020, 738215 3390 ఫోను నెంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో లోటస్ ఆద్య పాఠశాల అకడమిక్ డైరెక్టర్ వై.ఉమాదేవి, పి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న రాధాకృష్ణమూర్తి, గురుదత్, రాజేష్, ఉమాదేవి

కేఎల్‌యూ శాటిలైట్ల ప్రయోగం విజయవంతం



తాడేపల్లి రూరల్: గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కేఎల్ విశ్వవిద్యాలయం శనివారం శాటిలైట్లను నింగిలోకి పంపింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణరాజు, కేఎల్‌యూ వైస్ చైర్మన్ కోనేరు నిఖిల కార్తికేయన్, వీసీ పార్థసారథి వర్మలతో కలిసి కాన్‌శాట్‌ను నింగిలోకి వదిలారు. తొలుత బెలూన్ సహాయంతో మొదటి కేఎల్ జాక్ శాటిలైట్‌ను పంపారు. అత్యల్ప బరువు కలిగిన విద్యా శాటిలైట్లలో కేఎల్ జాక్ శాటిలైట్ ఒకటి. ఉదయం 5.45 నిమిషాలకు కేఎల్ జాక్ శాటిలైట్‌ను పీకో బెలూన్ సాయంతో వదిలారు. కేఎల్ జాక్ శాటిలైట్ గాలి నాణ్యతపై పరిశోధన చేయనున్నట్లు రూపకర్త డాక్టర్ సిహెచ్ కావ్యశ్రీ తెలిపారు. కేఎల్‌శాట్2ను ఫ్లెట్‌ట్ మోడ్ డ్రోన్ సహాయంతో ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఏటీసీ గన్నవరం ఎయిర్ ట్రాఫిక్ క్లియరెన్స్ వచ్చిన తరువాత 6.45 గంటలకు బెంగళూరుకు చెందిన రెడ్‌వింగ్ అనే సంస్థ సహకారంతో ఫ్లెట్‌ట్ మోడ్ డ్రోన్ సాయంతో నింగిలోకి పంపారు. శాటిలైట్ 1 గంట పాటు నిర్దేశిత కక్ష్యలో భూమి నుంచి సుమారు 12 కి.మీ. ఎత్తులో 60 కి.మీ. సమాంతరంగా ప్రయాణించి పరిశోధనలు చేసి మళ్లీ లాండ్‌ప్యాడ్‌పై విజయవంతంగా దిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస వర్మ మాట్లాడుతూ ఈనెల 27న ఉత్తరప్రదేశ్‌లో జరుగనున్న మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ పోటీల్లో కేఎల్‌యూ విద్యార్థులు రూపొందించిన కాన్‌శాట్ ఉపగ్రహం ఏపీ నుంచి ఎంపికైనట్లు పేర్కొన్నారు.

బెంగళూరులో ఇసుకదర్శి వాసి ఆత్మహత్య

మార్టూరు: మండలంలోని ఇసుకదర్శి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి శనివారం బెంగళూరులో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన వెంకట రమణయ్య (65) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో 15 రోజుల కిందట బెంగళూరులో ఉద్యోగం చేస్తున్న కుమార్తె వద్దకు వెళ్లాడు. అక్కడ ఉదయం నిద్ర లేచేసరికి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడటం గమనించిన కుమార్తె స్వగ్రామంలో బంధువులకు సమాచారం అందించింది. మృతదేహాన్ని సాయంత్రం అక్కడకు తరలించారు.

వైఎస్సార్‌సీపీలో నియామకాలు



పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని పలువురిని జిల్లా అనుబంధ కమిటీల్లో వివిధ హోదాల్లో నియమించారు. ఈ మేరకు శనివారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. మంగళగిరికి చెందిన రేటూరి గౌత్‌ను ఉపాధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శులుగా ప్రత్తిపాడుకు చెందిన కె.రామకృష్ణ, తాడికొండకు చెందిన గొంది రవి, కార్యదర్శులుగా ప్రత్తిపాడుకు చెందిన బండారు మణికంఠ, మంగళగిరికి చెందిన పూసం రామ్‌గోపాలరెడ్డి, తాడికొండకు చెందిన నేలపాటి నాగేంద్రం, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా తాడికొండ నియోజకవర్గానికి చెందిన ఎస్.ప్రశాంత్, మంగళగిరి నియోజకవర్గానికి చెందిన ఈమని శివారెడ్డి, ఎరమాల మురళి, ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన కర్రా వేణు, జంగా సుందర్‌లను నియమించారు. అదేవిధంగా జిల్లా బీసీ విభాగం ఉపాధ్యక్షుడిగా తెనాలికి చెందిన నంద్యాల ఉదయ్ శంకర్, ప్రధాన కార్యదర్శిగా తాడికొండకు చెందిన ఉడతా శ్రీనివాసరావు, కార్యదర్శిగా బొల్లెద్దు శివాజీ, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఇబ్రహీంపట్నం వెంకటేశ్వర్లు, మైనార్టీ విభాగం జిల్లా ఉపాధ్యక్షులుగా తాడికొండకు చెందిన పి.ఫిరోజ్‌ఖాన్, ప్రత్తిపాడుకు చెందిన షేక్ అబ్దుల్ సలాం, ప్రధాన కార్యదర్శులుగా మంగళగిరికి చెందిన షేక్ అబ్దుల్ రజాఖా, తెనాలికి చెందిన షేక్ చాంద్‌బాషా, కార్యదర్శులుగా ప్రత్తిపాడుకు చెందిన నూర్‌బాషా అలి అబ్బాస్, తాడికొండకు చెందిన షేక్ కరీముల్లా, షేక్ ఖాసీం, తెనాలికి చెందిన సయ్యద్ ఖలీల్, షేక్ ఆసీఫ్, మంగళగిరికి చెందిన షేక్ కిజార్ అల్లా సుభాని, మొహ్మద్ ఇర్ఫాన్, ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా ప్రత్తిపాడుకు చెందిన షేక్ నాగుల్‌మీరా, తాడికొండకు చెందిన షేక్‌హసన్ అహ్మద్, మంగళగిరికి చెందిన సయ్యద్ సలాం, షేక్ జమీరా అహ్మద్, తెనాలికి చెందిన షేక్ బదుల్లాలను నియమించారు. వీరితోపాటు రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా తాడికొండకు చెందిన పోరెడ్డి బాలిరెడ్డి, కార్యదర్శులుగా దండా కోటిరెడ్డి, ప్రత్తిపాడుకు చెందిన నెల్లూరి బాలకృష్ణ, ఎగ్జిక్యూటీవ్ మెంబర్‌గా తాడికొండకు చెందిన నాయుడు నాగేశ్వరరావు, ఎస్సీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా పొన్నూరు నియోజకవర్గానికి చెందిన జి.ప్రకాష్ బాబు, ప్రధాన కార్యదర్శులుగా గుంటూరు తూర్పు నియోజకవర్గానికి చెందిన ఇమ్మల త్రివేణీ, తాడికొండ నియోజవకర్గానికి చెందిన మేకల రవి, తెనాలికి చెందిన కొమ్ము రాయల్, మంగళగిరికి చెందిన కొండూరు శేషయ్య, కార్యదర్శులుగా గుంటూరు తూర్పుకు చెందిన పోసిపోగు దేవసహాయం, తాడికొండకు చెందిన కఠారి కృష్ణ, తెనాలికి చెందిన అత్తోట కిషోర్‌కుమార్, పొన్నూరుకు చెందిన చందులో ఇమ్మానియేల్, మంగళగిరికి చెందిన పెరికి అంకయ్య, ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా గుంటూరుకు చెందిన వడ్డె కోటేశ్వరరావు, సంకూరు సురేంద్ర, తాడికొండకు చెందిన తలతోక వెంకటేశ్వర్లు, తెనాలికి చెందిన ముప్పా చందు, పొన్నూరుకు చెందిన బత్తుల వీరయ్య, గుండా బత్తిన శ్యామ్‌సన్, మంగళగిరికి చెందిన కె. పరమేశ్వర దాసు, కె.నాగరత్నం, జిల్లా బూత్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా తాడికొండకు చెందిన సి.హెచ్.భాగ్యారావు, కార్యదర్శిగా పులి ప్రకాష్; జిల్లా కల్చరల్ విభాగం ప్రధాన కార్యదర్శిగా తాడికొండకు చెందిన మేరుగ యోహాన్, కార్యదర్శిగా పులివర్తి నాగరాజు, జిల్లా దివ్యాంగుల విభాగం ఉపాధ్యక్షుడిగా గుంటూరు తూర్పుకు చెందిన షేక్ బషీర్, ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా చెల్లి సతీష్, దేవినేని రమేష్, డాక్టర్స్ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా తాడికొండకు చెందిన షేక్ అబ్దుల్‌సలీం, జిల్లా గ్రీవెన్స్ సెల్ ప్రధాన కార్యదర్శిగా తాడికొండకు చెందిన ఇందూరి శ్రీనివాస రెడ్డి, కుర్రా హరిబాబు, జిల్లా ఇంటిలెక్చువల్ ఫోరం ప్రధాన కార్యదర్శిగా తాడికొండకు చెందిన గొట్టిపాటి ఇశ్రాయేల్, కార్యదర్శిగా దివ్వెల రాజశేఖర్, ఐటీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా తాడికొండకు చెందిన నూతక్కి మనోహర్, కార్యదర్శులుగా గొల్లపూడి మహేష్, గుంటుపల్లి ప్రదీప్, లీగల్ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా తాడికొండకు చెందిన దారా తిరుమలరావు, మహిళ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా కంజుల భార్గవి, కార్యదర్శులుగా కొమ్ము రాజేశ్వరి, ప్రత్తిపాడుకు చెందిన కరసాల భవానీలను నియమించారు.

జిల్లా పంచాయతీరాజ్ విభాగంలో...

అదేవిధంగా జిల్లా పంచాయతీరాజ్ విభాగం ప్రధాన కార్యదర్శులుగా తాడికొండకు చెందిన బొద్దు చిన్న సాంబశివరావు, ప్రత్తిపాడుకు చెందిన వై.జగన్‌మోహన్‌రెడ్డి, కార్యదర్శులుగా దేవిరెడ్డి సాంబశివారెడ్డి, తాడికొండకు చెందిన కంభంపాటి శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరెడ్డి, ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా కంజుల బ్రహ్మారెడ్డి, సాతులూరి సురేష్, ముప్పా శ్రీదేవి, జిల్లా పబ్లిసిటీ విభాగం ప్రధాన కార్యదర్శులుగా తాడికొండకు చెందిన షేక్ అబ్దుల్లా, ప్రత్తిపాడుకు చెందిన లింగా సాగర్, కార్యదర్శులుగా బండారు రాజేష్, దాసరి శివాంజనేయులు, సంకూరి రత్తయ్య, కూచిపూడి విద్యాసాగర్, ఎగ్జిక్యూటీవ్‌మెంబర్లుగా మేదరమెట్ల సుధాకర్, షేక్ సుభాని, జిల్లా ఆర్టీఐ విభాగం ప్రధాన కార్యదర్శిగా తాడికొండ నియోజకవర్గానికి చెందిన ఏరువ శౌరిరెడ్డి, కార్యదర్శిగా మిక్కిలి ప్రేమ్‌కుమార్, ఎగ్జిక్యూటీవ్ మెంబర్‌గా చెవుల కృష్ణమోహన్, జిల్లా సోషల్ మీడియా విభాగం ఉపాధ్యక్షుడు గా మంగళగిరికి చెందిన కర్రి భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా కొరిటెపాటి రాంబాబు, కార్యదర్శులుగా కొలకలూరి నందకిషోర్, పచ్చల రాజు, షేక్ రఫీ, ఎస్టీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా తాడికొండకు చెందిన రాపూరి మహేంద్రబాబు, కార్యదర్శిగా కొమరగిరి సూరిబాబు, జిల్లా విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శిగా కంచర్ల రాజు, కార్యదర్శిగా జి.కామేశ్వరరావు, ఎగ్జిక్యూటీవ్ మెంబర్‌గా షేక్ బాజీ, వాణిజ్య విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొండవీటి మగ్బుల్, కార్యదర్శిగా కాకర్ల నాగేశ్వరరావు, వలంటీర్స్ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శులుగా రాయపూడి సాగర్‌బాబు, కాళహస్తి భవానీ శంకర్, కార్యదర్శిగా తియ్యగూర అంజిరెడ్డి, ఎగ్జిక్యూటీవ్ మెంబర్‌గా షేక్ ఖాదర్‌వలి, వీవర్స్ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా పోలిశెట్టి జోసఫ్, కార్యదర్శిగా షేక్‌జాన్ బాషా, వైఎస్సార్ టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శులుగా పి.శ్రీనివాసరెడ్డి, గుంటూరు వెస్ట్‌కు చెందిన నల్లమోతు విజయసాగర్, కార్యదర్శిగా కలవకొల్లు నరసింహారావు, ఎగ్జిక్యూటీవ్ మెంబర్‌గా యాదాల వీరవసంతరావులను నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష దరఖాస్తు గడువు పొడిగింపు

గుంటూరు ఎడ్యుకేషన్: డిసెంబర్ 7న జరగనున్న జాతీయ ప్రతిభా ఉపకార వేతన (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకు తుది గడువును ఈనెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తుది గడువు ముగిసిన తరువాత ఎట్టిపరిస్థితుల్లోనూ గడువు పొడిగించే అవకాశం లేదని, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, మోడల్ స్కూళ్లలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. సంబంధిత విద్యార్థులకు 7వ తరగతి కనీసం 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 50 శాతం ఉండాలని పేర్కొన్నారు. కుటుంబ వార్షికాదాయం రూ.3.50 లక్షలలోపు ఉండాలని, విద్యార్థి ఆధార్‌లో ఉన్న విధంగానే విద్యార్థి పేరు, తండ్రి పేరు నమోదు చేయాలని సూచించారు. పరీక్ష రుసుం రూపంలో ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 చొప్పున చెల్లించాలని సూచించారు. పూర్తి వివరాలకు ఇదే వెబ్‌సైట్‌తో పాటు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ద్వారా తెలుసుకోవాలని తెలిపారు.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

అద్దంకి రూరల్: అద్దంకి పట్టణంలోని కాకానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గురకాయపాలెం పాఠశాలలో శనివారం 356 మంది విద్యార్థినులకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సైకిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలో 10 వేల సైకిళ్లు పంపిణీ చేయాలని సంకల్పంతో ఉన్నట్లు తెలిపారు. అనంతరం కొరిశపాడు మండలం మేదరమెట్లలో ప్రజలకు జీఎస్టీపై అవగాహన కల్పించారు. అనంతరం మేదరమెట్ల-తమ్మవరం బీటీ రహదారిని ప్రారంభించారు. కలెక్టర్ వినోద్ కుమార్‌తో కలిసి స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీలకు కారంచేడు విద్యార్థి ఎంపిక

కారంచేడు: త్వరలో రాష్ట్ర స్థాయిలో జరగనున్న బ్యాడ్మింటన్ పోటీలకు కారంచేడుకు చెందిన యార్లగడ్డ బుచ్చయ్య చౌదరి ఎంపికయ్యాడు. ఉమ్మడి ప్రకాశం జిల్లా సింగరాయకొండ గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో ఈనెల 17వ తేదీన జరిగిన జిల్లా స్థాయి పోటీలు జరిగాయి. ఇందులో కారంచేడు యార్లగడ్డ నాయుడమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి బుచ్చయ్య చౌదరి విజయం సాధించాడు. హెచ్ఎం ఎం. సామ్రాజ్యం, పీడీ షేక్ మస్తానీ అభినందించారు.

● నరక చతుర్దశి



చెడును నరికేసి... మంచిని వెలిగించి!



ఏదైనా శుభసంఘటన జరిగినప్పుడు కాని, ఎవరైనా మహానుభావులు పుట్టినప్పుడు కాని పండుగలు, వేడుకలు, సంబరాలు చేసుకుంటారు. కాని, ఈ సందర్భంలో ఒకరు చనిపోతే అతడి పేరు మీద పండగ చేసుకోవటం జరుగుతోంది. అతడి చావు ఎందుకంతగా సంతోషప్రద మయిందంటే.... నరకుడు అజ్ఞానానికి, పీడనకు, హింసకు ప్రతీక. నరకం అంటే దుర్గతి. అది కలవాడు నరకుడు. అంటే చెడు నడత కలవాడు. ఆ చెడు తన కుమారునిలో ఉందన్న కారణంగానే అతడి సంహారానికి కారణమయింది తల్లి సత్యభామ. తనలా మరే తల్లీ ఎవరి గర్భశోకానికీ కారణం కాకూడదన్న కోరికతో తన కుమారుడి పేరు శాశ్వతంగా నిలిచి పోయేలా వరం కోరుకుంది. అందుకే శ్రీకృష్ణుడు అతడి పేరు మీదుగానే భవిష్యతులో అందరూ 'నరక చతుర్దశి' జరుపుకుంటారని వరమిచ్చాడు.

హిరణ్యాక్షుడు లోకానికి ఉపద్రవంగా భూదేవిని చుట్టచుట్టి సముద్రంలో ముంచినప్పుడు విష్ణుమూర్తి వరాహావతారమెత్తి, ఆ రాక్షసుని సంహరించి భూదేవిని ఉద్ధరించాడు. ఆ సందర్భంగా భూదేవికి విష్ణుమూర్తి వరప్రసాదం వల్ల భీముడనే పుత్రుడు జన్మించాడు. అతనే దుర్మార్గుడైన నరకాసురునిగా పేరొందాడు. నరకుడు ప్రాగ్జోతిషపురం రాజధానిగా కామరూప రాజ్యాన్ని పాలిస్తూ ఉండేవాడు. భూమాత తన కుమారుని రాక్షసత్వానికి దూరంగానే పెంచింది. దురదృష్టవశాత్తు నరకుడు అసుర ప్రభావంలో పడి ఘోరతపస్సు చేసి అనేక వరాలు పొందాడు. తనకు తన తల్లి చేతిలో తప్ప మరణం సంభవించకూడదని కూడా వరం పొందాడు. ఎందుకంటే స్వయానా తన తల్లే తనను చంపదని అతని ధీమా. ఆ వరగర్వంతో అతను చేసిన దుష్కార్యాలు పరాకాష్టకు చేరి దేవతలను తీవ్ర అశాంతికి గురి చేసాయి. నరకుడు విష్ణుద్వేషియై దేవతలను హింసించసాగాడు.

దేవమాత అదితి కుండలాలను, వరుణ ఛత్రాన్ని అపహరిస్తే శ్రీ కృష్ణుడు ఇతనిని ద్వంద్వ యుద్ధంలో ఓడించి, వాటిని తిరిగి అదితికి అందజేసాడు. మరొకప్పుడు మదపుటేనుగు రూపంలో విశ్వకర్మ పుత్రికను చెరపట్టాడు. వీరూవారనే విచక్షణ లేకుండా గంధర్వ, దేవ, మానవ కన్యలను బలవంతంగా అపహరించి, తన అంతఃపుర పంజరంలో బంధించడం వాడికో వ్యసనం. ఇతని దౌర్జన్యాలు అంతటితో ఆగలేదు. చివరకు ఇంద్రునిపైకి కూడా దండెత్తి ఆయన అధికార ముద్రను అపహరించడంతో ఈ రాక్షసాధముని దురంతం పరాకాష్టనందుకుంది. ఇంద్రుడు ఆపద రక్షకుడైన శ్రీ కృష్ణుని శరణు వేడగా గోపాలుడు నరకునిపై దండెత్తాడు. అయితే నరకాసురుని విషపుబాణానికి శ్రీ కృష్ణుడు ఒక క్షణంపాటు నిశ్చేష్టుడయ్యాడు. అది గమనించి ఆయనతో కూడానే ఉన్న ఆయన సతీమణి సత్యభామ ఉగ్రురాలై భయంకరమైన తన బాణాన్ని ప్రయోగించి నరకుణ్ణి నిలువరించింది. ఆ తర్వాత కృష్ణుడు తేరుకుని సుదర్శన చక్రం ప్రయోగించి అతడిని సంహరించాడు. అలా ఆశ్వీయుజ బహుళ చతుర్దశినాడు లోక కంటకుడైన నరకుని మరణం సంభవించింది. యాదృచ్ఛికంగా నరకాసురుని మరణం సత్యభామ రూపంలో తన తల్లి భూదేవి వల్లనే సంభవించింది.

తన పుత్రుని పేరైనా కలకాలం నిలిచి ఉండేలా చేయమని సత్యభామ ప్రార్థించడంతో ఆ రోజు నరక చతుర్దశిగా పిలువబడుతుందని వరం ప్రసాదించాడు శ్రీ కృష్ణుడు. నరకుని చెరనుండి సాధుజనులు, పదహారు వేలమంది రాజ కన్యలు విడిపించబడ్డారు, ధర్మం సుప్రతిష్ఠమైంది.

ఈ రోజు ఏం చేయాలి?

ఈ చతుర్దశి యమునికి ఎంతో ఇష్టమైన రోజు. ఈ రోజు సూర్యోదయానికి ముందే నువ్వుల నూనెతో తలంటుకొని, అభ్యంగన స్నానం చేయాలి. ప్రత్యేకించి ఆ వేళ నువ్వులనూనెలో లక్ష్మి, మంచినీటిలో గంగాదేవి కొలువై ఉంటారని శాస్త్రాలు వివరిస్తున్నవి. యమ ధర్మరాజును స్మరించి, నమస్కరించి, యమ తర్పణ చేయడాన్ని విశిష్టంగా పెద్దలు చెబుతారు. అభ్యంగన స్నానానంతరం దక్షణాభిముఖంగా 'యమాయః తర్పయామి' అంటూ మూడుసార్లు నువ్వులతో యమునికి తర్పణం ఇవ్వడం ఆచారం. యముని పూజించి, మినుములతో చేసిన పదార్థాలు తినడంతో పాటు సూర్యాస్తమయం తర్వాత ముంగిట్లో, పడకగదిలో దీపాలను వెలిగించి, టపాకాయలు కాలుస్తారు. ఈ చతుర్దశి రోజు సాయంత్రం ఎవరైతే దీపాలు వెలిగించి దానధర్మాలు చేస్తారో వారి పితృదేవతలకు నరకబాధ తొలగుతుందని భారతీయుల నమ్మకం.

నరక చతుర్దశినాడు దీపదానం చేస్తే పితృదేవతలందరికీ స్వర్గనివాసం కలుగుతుందని విశ్వసిస్తారు. ఇదేరోజున సాయం సమయంలో నూనెతో తడిపిన, రసాయన ద్రవ్యాలతో తయారు చేసిన కాగడాలను చేతబట్టుకొని తిరిగినట్లయితే పితృదేవతలకు దారి చూపినట్లవుతుందనీ పెద్దలు నమ్ముతారు. నరకచతుర్దశి మరునాడే దీపావళి.

– డి.వి.ఆర్.

● ఆఫీసర్లు

నరకాసురులపై నారీ శక్తి

దుష్ట ప్రవృత్తి గల నరకాసురుడిపై సత్యభామ సాధించిన విజయానికి గుర్తుగా దీపావళి జరుపుకుంటాం. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో నేరాలు చేసే ఎందరో నరకాసురులకు సత్యభామలుగా మారిన పోలీసు ఆఫీసర్లు చెక్ చెప్తున్నారు. నేడు నరక చతుర్దశి సందర్భంగా మహిళా పోలీస్ అధికారుల ప్రాధాన్యం గురించి...



















హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడెమీలో (ఎన్‌పీఏ) తాజాగా శిక్షణ పూర్తి చేసుకున్న ఐపీఎస్ అధికారుల్లో 36 శాతం మహిళలే. ఎన్‌పీఏ చరిత్రలో ఇదో రికార్డు. దీనికిముందే ఇలాంటి అరుదైన దృశ్యం తెలంగాణలో ఆవిష్కృతమైంది. సెప్టెంబర్‌లో చోటు చేసుకున్న ఐపీఎస్ అధికారుల బదిలీతో రాష్ట్ర పోలీసు విభాగంలోని హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్‌లో మకుటాలను 33.3 శాతం మహిళలే ధరించారు.

ఉమ్మడి రాష్ట్రంలో 1979 వరకు మహిళా ఐపీఎస్‌లే లేరు. ఆ ఏడాది ఎన్‌పీఏలో శిక్షణ పూర్తి చేసుకున్న హైదరాబాదీ యువతి అరుణ బహుగుణ చిత్తూరు జిల్లా మదనపల్లె అదనపు ఎస్పీగా పోస్టింగ్ పొందారు. ఇది అప్పట్లో సంచలనం. ఆపై కాలక్రమంలో మహిళ ఐపీఎస్‌ల సంఖ్య పెరుగుతూ వచ్చింది. అయినప్పటికీ 2014 వరకు వీరికి సముచిత పోస్టింగ్స్ ఉండేవి కాదు. అత్యవసర సందర్భాల్లో అక్కరకు రావడానికి కమిషనరేట్‌కు ఒక మహిళ ఐపీఎస్‌కు పోస్టింగ్ ఇచ్చేవాళ్లు. మిగిలిన అధికారుల్ని అంతగా ప్రాధాన్యం లేని పోస్టుల్లో నియమించే వారు.

రానురాను ఆ సీన్ పూర్తిగా మారిపోతూ వచ్చింది. పోలీసు విభాగంలో మహిళ ఐపీఎస్ అధికారుల సంఖ్య గణనీయంగా పెరుగుతుండటంతో పోస్టింగ్స్ ఇవ్వడం అనివార్యంగా మారింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత మహిళల భద్రతకు పెద్ద పీట వేస్తూ మహిళ భద్రత విభాగం, షీ–టీమ్స్ ఏర్పాటైన తర్వాత వీటిలో అనివార్యంగా మహిళ ఐపీఎస్‌లకే పోస్టింగ్ ఇస్తూ వచ్చారు. కమిషనరేట్లలో డీసీపీ పోస్టులతో పాటు కొన్ని జిల్లాలకు మహిళల్ని ఎస్పీలుగా నియమించారు. ప్రస్తుతం పరిస్థితులు పూర్తి భిన్నంగా మారిపోయాయి. రాష్ట్ర పోలీసు విభాగంలో ఉన్న మూడో వంతు హెచ్‌ఓడీ పోస్టులతో పాటు హైదరాబాద్, రాచకొండల్లోని డీసీపీ పోస్టుల్లో అత్యధికంగా మహిళా ఐపీఎస్‌లే ఉన్నారు.

ఎస్సైల నుంచి డీఎస్పీల వరకు శిక్షణ ఇచ్చే తెలంగాణ రాష్ట్ర పోలీసు అకాడెమీకి అభిలాష్ బిస్త్, నేరగాళ్లలో మార్పునకు కృషి చేసే జైళ్లశాఖకు సౌమ్య మిశ్ర, రాష్ట్ర నేర పరిశోధన విభాగానికి (సీఐడీ) చారు సిన్హా, మావోయిస్టు వ్యతిరేక నిఘా విభాగమైన బి.సుమతి, హోంగార్డ్స్ వింగ్‌కు స్వాతి లక్రా నేతృత్వం వహిస్తూ తమ సత్తా చాటుతున్నారు. ఈ ప్రకారం చూస్తే 15 హెచ్‌ఓడీ పోస్టుల్లో ఏడింటికి ఐదుగురు మహిళ ఐపీఎస్‌లు నేతృత్వం వహిస్తున్నట్లు లెక్క. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు శిఖా గోయల్ చీఫ్‌గా, అవినీతి నిరోధక శాఖకు చారు సిన్హా ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. ఇక రాష్ట్రంలోనే అత్యంత కీలకమైన హైదరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో మహిళా పోలీసుల సంఖ్య తక్కువగా ఉండటంతో పాటు ఉన్నత స్థాయిలో కూడా ఉండేవారు కారు. అయితే కాలక్రమంలో వీరి సంఖ్య కాస్త పెరిగినా...

నగరంలో హఠాత్తుగా తలెత్తే పరిణామాలతోపాటు మతకలహాలను అదుపు చేయడం, వేళాపాళా లేని విధులు వీరితో సాధ్యం కాదనే భావన గతంలో ఉండేది. కాలక్రమంలో చోటు చేసుకున్న పరిస్థితులు, పరిణామాల నేపథ్యంలో నగర పోలీసు విభాగంలోనూ ఒక మహిళ ఉన్నతాధికారి ఉండాలని ప్రభుత్వమూ భావించినప్పటికీ చాన్నాళ్ళ వరకు కేవలం నార్త్‌జోన్‌కు మాత్రమే మహిళ అధికారిని నియమిస్తూ వచ్చారు. ఆ జోన్‌కు ఉండే ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో సిటీ పోలీసువింగ్‌లో మహిళ ఉన్నతాధికారి పోస్టు ఇదొక్కటే అనే భావన కొనసాగింది.

ప్రస్తుతం పరిస్థితులు మాత్రం పూర్తిగా మారిపోయాయి. హైదరాబాద్ కమిషనరేట్‌లో ఏడు జోన్లు ఉన్నాయి. ఒక్కో జోన్‌కు ఒక్కో డీసీపీ నేతృత్వం వహిస్తుంటారు. ప్రస్తుతం ఈ ఏడు జోన్లలో మూడింటికి మహిళ ఐపీఎస్‌లే డీసీపీలుగా ఉన్నారు. మధ్య మండలానికి శిల్పవల్లి, ఉత్తర మండలానికి సాధన రష్మీ పెరుమాళ్, దక్షిణ మండలానికి స్నేహ మెహ్రా డీసీపీలుగా ఉన్నారు. వీరికి తోడు పరిమళ నూతన్, పరిపాలన విభాగం సంయుక్త సీపీగా, రక్షితమూర్తి, సీఏఆర్ హెడ్–క్వార్టర్స్ డీసీపీగా, అపూర్వ రావు– స్పెషల్ బ్రాంచ్ డీసీపీగా, ఎస్.శ్వేత డిటెక్టివ్ డిపార్ట్‌మెంట్ డీసీపీ గా, డి.కవిత,సైబర్ క్రైమ్ విభాగం డీసీపీగా, లావణ్య జాదవ్– ఉమెన్ సేఫ్టీ డీసీపీగా పని చేస్తున్నారు.

హైదరాబాద్ చుట్టూ విస్తరించి ఉన్న సైబరాబాద్‌లోని అత్యంత కీలకమైన మాదాపూర్ జోన్‌కు డీసీపీగా రితిరాజ్ వ్యవహరిస్తున్నారు. ఇక రాచకొండలో మొత్తం నాలుగు జోన్లు ఉన్నాయి. వీటిలో మల్కాజ్‌గిరి, ఎల్బీనగర్, మహేశ్వరానికి పద్మజ రెడ్డి, అనురాధ, సునీత రెడ్డి డీసీపీలుగా ఉన్నారు. వీరిలో సునీత రెడ్డి మాత్రమే నాన్ ఐపీఎస్ అధికారి. ఈ జోనల్ డీసీపీలతో పాటు మహిళ భద్రత విభాగం, సైబర్ క్రైమ్ వింగ్స్‌లను ఆ'షీ'సర్స్ నేతృత్వం వహిస్తున్నారు.

– శ్రీరంగం కామేష్,
క్రైమ్ రిపోర్టర్, సాక్షి, హైదరాబాద్

రావణుడు... మా ఊరి అల్లుడు!

దీపావళి అంటేనే సంబరాలు అంబరాన్ని అంటుతాయి. అయితే రాజస్థాన్‌లోని జోద్‌పూర్‌కు పది కిలోమీటర్‌ల దూరంలో ఉన్న మండోల్‌లో దీపావళి రోజు దీపాలు వెలిగించడం, బాణసంచ కాల్చడం ఉండదు. నిశ్శబ్దాన్ని పాటిస్తారు. కారణం ఏమిటి? అనే విషయానికి వస్తే స్థానిక పురాణం తెలుసుకోవాల్సిందే. దీని ప్రకారం... రావణుడి భార్య మండోదరి జన్మస్థలం మండేరే. రావణుడు మండోదరిని ఈ గ్రామంలోనే వివాహం చేసుకున్నాడని నమ్ముతారు. మండేరేకి చెందిన మౌద్గిల్ బ్రాహ్మణులు తమను తాము మండోదరి కుటుంబ వారసులుగా భావిస్తారు. అందువల్ల వారు రావణుడిని రాక్షస రాజుగా కాకుండా గౌరవనీయమైన బంధువుగా చూస్తారు!

చీకటి దీపావళి!

దీపావళి వేడుకల తర్వాత హిమాచల్‌ప్రదేశ్‌లో బుద్ధి దీపావళి(చీకటి దీపావళి లేదా పాత దీపావళి) జరుపుకుంటారు. దీపావళి తర్వాత మొదటి అమావాస్య రోజు బుద్ధి దీపావళి వేడుకలు మొదలవుతాయి. రాముడి రాక వార్త ఒక నెల తర్వాత మాత్రమే హిమాచల్‌ప్రదేశ్‌కు చేరిందట. అందుకే ఆలస్యంగా పండగ జరుపుకునే సంప్రదాయం మొదలైంది అంటారు.

దేవరి రాత్రి

ఛత్తీస్‌ఘడ్‌లోని గోండు తెగలు దీపావళిని 'దేవరి'గా జరుపుకుంటాయి. దేవరి రాత్రి గ్రామంలోని మహిళలు తలలపై ఒక కుండలో నూనె దీపాన్ని వెలిగించి శ్రావ్యంగా పాటలు పాడుతూ, ప్రతి ఇంటి తలుపు తడుతూ తమతో చేరాలని ఆ ఇంటి మహిళలను అభ్యర్థిస్తారు. బియ్యపు పిండితో చేసిన దీపాలను ప్రతి ఇంటి ముందు ఉంచుతారు.

ఆవులను తమపై నడిపించి...

మధ్యప్రదేశ్ ఉజ్జయిని జిల్లాలోని బిదావాద్ గ్రామంలో ఒక వింత ఆచారం ఉంది. దీపావళి రోజు తరువాత నేలపై పడుకొని ఆవులను తమపై నడిపించుకుంటారు. 33 కోట్ల దేవుళ్లు, దేవతలు ఆవులో కొలువై ఉన్నారని, వాటిని తమపై నడిపించుకోవడం ద్వారా దేవతల ఆశీర్వాదం దొరుకుతుందనేది భక్తుల నమ్మకం.

భర్త కోసం రాత్రంతా దీపాలు...

మహారాష్ట్రలో దీపావళి వేడుకలకు సంబంధించి ఒక ఆసక్తికరమైన జానపద కథ ప్రచారంలో ఉంది. వివాహం జరిగిన నాలుగు రోజుల తరువాత చనిపోతాడని యువ రాజుకు శాపం. విషయం తెలిసిన వధువు తన భర్త ప్రాణాలు రక్షించుకోవడం కోసం రాత్రంతా అవిశ్రాంతంగా దీపాలు వెలిగిస్తూనే ఉంటుంది. ఆమె ప్రయత్నాల వల్ల భర్త బతుకుతాడు.

శ్రీవిష్ణువు భూలోకానికి...

గుజరాత్‌లో దీపావళి రోజు కొత్త వ్యాపారాలు ప్రారంభించడం అనేది తరతరాలుగా వస్తోంది. మహాలక్ష్మీదేవి భర్త విష్ణువు భూలోకానికి వచ్చిన గుర్తుగా మధ్యప్రదేశ్‌లో దీపావళి జరుపుకుంటారు. కోల్‌కత్తాలో దీపావళికి కాళీ పూజ చేస్తారు.

సోదర, సోదరీమణులు...

మన దేశంలోని కొన్ని ప్రాంతాలలో దీపావళి అనేది సోదర, సోదరీమణుల అనుబంధానికి ముడి పడి ఉన్న పండగగా జరుపుకుంటారు. దీపావళి తర్వాత రోజు జరుపుకునే ఈ పండగను 'యమ–ద్వితీయ' అని పిలుస్తారు. యమున తన సోదరుడు, మృత్యుదేవుడు యముడికి ఆతిథ్యం ఇచ్చిన రోజు ఇదే అని పురాణ కథలు చెబుతాయి.

లక్ష దీపాల ఆగ్రా కోట

అక్బర్ చక్రవర్తి పాలనలో దీపావళిని ఆనందోత్సాహాలతో జరుపుకునేవారు. ఈ సంప్రదాయాన్ని 'జష్నే చిరాఘన్' అని పిలిచేవారు. లక్షలాది దీపాలతో ఆగ్రా కోట వెలిగిపోయేది. కోట ముందు ఉన్న మైదానంలో బాణసంచా కాల్చేవారు.

● కళా స్ఫూర్తి

'ఒక మహిళ పురుషుడి పాత్రలో మెప్పించడం చాలా కష్టం' అంటారు సురభి కళాకారిణి 60 ఏళ్ల పద్మజా వర్మ. ఇప్పటి వరకు కృష్ణుడి పాత్రలో వేదికలపైన 3000కు పైగా నాటక ప్రదర్శనలు ఇచ్చిన పద్మజా వర్మ సత్యభామగానూ మెప్పించారు. ప్రత్యేక పురస్కారాలనూ అందుకున్నారు. నేడు నరకచతుర్దశి సందర్భంగా కృష్ణుడి పాత్రలో జీవించిన పద్మజా వర్మ సాక్షి ఫ్యామిలీతో పంచుకున్న విశేషాలు ...

కృష్ణుడిగా... సత్యభామ!





సురభి పద్మజ వర్మకు దాదాపు 60 ఏళ్ల నాటక రంగ అనుభవం ఉంది. కృష్ణుడి పాత్రలో ప్రేక్షకులను మెప్పిస్తూ, కుటుంబ పోషణలో భాగమయ్యింది. గృహిణిగా, ఇద్దరు పిల్లల తల్లిగా, కోడలిగా కుటుంబ జీవనంలోని సర్దుబాట్లను, తనకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్న విధానాన్ని మన ముందుంచారు.

మగవారి మధ్యలో ఒక్కదాన్నే మహిళను

''మగవేషాలంటే చాలా ఠీవిగా నిలబడాలి. హుందాగా కనిపించాలి. కిరీటం పెట్టుకొని వేసే వేషం ఏదైనా కష్టమే. అందులోనూ మహిళ పురుషుడి వేషం వేయడం పెద్ద సవాల్. ఆ సమయంలో స్టేజీపైన చుట్టూతా మగవారే. కృష్ణుడి వేషంలో నేనొక్కదాన్నే మహిళను. నటనలో ఎటువంటి జంకు కనిపించకూడదు. గొంతులో తత్తరపాటు ఉండకూడదు. కిరీటం పక్కకు జరగకూడదు, ఫ్లూట్ పట్టుకోవడంలో నేర్పు ఉండాలి. అన్నింటినీ బ్యాలెన్స్ చేసుకుంటూ రెండున్నర గంటల పాటు సీనును రక్తికట్టించాలి. అదో పెద్ద టాస్క్.

బాల్యం నుంచీ...

మూడు నెలల పసిబిడ్డగా ఉన్నప్పుడే మా అమ్మానాన్నలు నన్ను వేదికమీదకు తీసుకెళ్లారు. శ్రీకృష్ణ లీలల్లో భాగంగా బాల కృష్ణుడి పాత్రలను ప్రదర్శించాను. మాకు చదువు అయినా, నటన అయినా కళారంగమే. పన్నెండేళ్ల తర్వాత మాయాబజార్‌లో శశిరేఖగా వేషాలు వేశాను. శశిరేఖగా ప్రదర్శనలో పాల్గొన్నప్పుడు నా పాత్ర పూర్తయ్యాక ఒక వైపు కూర్చొని ఆ నాటక ప్రదర్శన మొత్తం చూసేదాన్ని. శశిరేఖ పాత్ర టీనేజ్ వరకే. ఆ వయసు దాటితే ఆ పాత్ర మరొకరికి ఇచ్చేస్తారు. నాకూ కొంత వయసు వచ్చాక శశిరేఖ బదులు రుక్మిణి, సత్యభామ.. ఇలా మహిళా ప్రాధాన్యత గల వేషాలే ఇచ్చారు.

సత్యభామ.. మీరజాలగలరా..!

కృష్ణుడి పాత్రకు దీటుగా ఉండేది సత్యభామ పాత్రే. సత్యభామగా నటించేటప్పుడు ఆ పాత్రకు ఉన్న హావభావాలన్నీ ముఖంలో పలికించాలి. 'మీర జాల గలడా నా యానతి...' అనే పాటలో నవరసాలు ఒలికించాలి. స్త్రీ పాత్రల్లోనూ మెప్పిస్తూ .. ఒక్కో దశ దాటుతున్న కొద్దీ మహిళా ప్రాధాన్యత ఉన్న పాత్రలు మారిపోతుండటం గమనించాను.

సందేహాలను జయిస్తూ... కృష్ణుడిగా మెప్పిస్తూ!

ఇలాగే ఉంటే కళారంగంలో నా ప్రాధాన్యత ఏముంటుంది అని నన్ను నేనే ప్రశ్నించుకునేదాన్ని. 'పురుష పాత్రలు అయితేనే మార్పు లేకుండా ఎప్పటికీ వేయచ్చు, ఎలాగా...' అని ఆలోచించేదాన్ని. పెళ్లయ్యాక మా మామగారి సొంత నాటక కంపెనీలోనే రకరకాల మహిళా ప్రాధాన్యమున్న పాత్రలు వేశాను. ఒకరోజు కృష్ణ వేషధారి ఆరోగ్యం బాగోలేక రాలేదు. ప్రదర్శన ఉంది. ఎలా అని ఆందోళన పడుతున్న సమయంలో 'నేను కృష్ణుడిగా వేస్తాను' అని మా మామగారికి ధైర్యం చెప్పాను. అలా మాయాబజార్‌లో కృష్ణుడిగా నటించాను. అయితే, పురుషుడిలా డ్రెస్ అవ్వడం.. మామూలు విషయం కాదని ఆ రోజే తెలిసింది. కంస వధ నాటకంలో మాత్రం కొంత టెన్షన్ పడ్డాను. ఎందుకంటే, కంస పాత్రధారి మా మామగారే. కంసుని వధించేటప్పుడు బాహాబాహీ తలపడటం, గుండెల మీద కొట్టడం.. వంటివి ఉంటాయి. కానీ, నటనలో రిలేషన్ కాదు ప్రతిభనే చూపాలనుకున్నాను. అక్కణ్నుంచి ఇక నేనే కృష్ణుడిని. అలా నేటివరకు 3000కు పైగా కృష్ణుడి పాత్రలు వేసిన ఘనత నాకు దక్కింది. నాటకాన్ని చూసిన ప్రేక్షకులు స్వయంగా కలిసి, వారి అభిమానాన్ని తెలుపుతూ ఉంటారు. సాధారణ చీరలో నన్ను చూసినవారు 'మీరేనా కృష్ణుడు' అని ఆశ్చర్యపోతుంటారు. ఎందుకంటే, అలంకరణలో వేదికపైన కృష్ణుడిలా మరో కొత్త జన్మ ఎత్తినట్టుగా ఉంటుంది. అప్పట్లో భయపడి కృష్ణుడి పాత్రను వదిలేసి ఉంటే.. నాటకరంగంలో నా ప్రత్యేకత అంటూ ఏమీ ఉండేది కాదు. నాకు ఈ యేడాది 60 ఏళ్లు పూర్తయ్యాయి. ఆ కృష్ణ పరమాత్మ అనుగ్రహం వల్ల మా పిల్లలిద్దరూ జీవితాల్లో బాగానే స్థిరపడ్డారు. ఇక నాకు బాధ్యతలేం లేవు కాబట్టి నా చివరిశ్వాస వరకు కృష్ణుడిలా నాటకరంగంలో మెప్పిస్తూనే ఉంటాను'' అని వివరించారు కృష్ణ పాత్ర ధారి పద్మజావర్మ.

– నిర్మలా రెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి